
సత్తుపల్లి: అయ్యగారిపేట చప్టా వద్ద ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్


వైరా: రాజీవ్ నగర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్


మధిర: మర్లపాడులో పత్తి చేనులో నిలిచిన నీరు


తల్లాడ: అన్నారుగూడెంలోని ఇంటిలోకి చేరిన వరద నీరు


కల్లూరురూరల్: చెన్నూరు దళిత కాలనీలో రహదారిపై పోటెత్తిన వరదనీరు


వేంసూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పవాగు


ఎర్రుపాలెం: కట్లేరుకు పెరిగిన వరద ఉధృతి


వైరారూరల్: వాగును తలపిస్తున్న పంట పొలాలు

వదలని వాన..

పోటెత్తిన వరద.. రాకపోకలకు అంతరాయం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తుండగా.. చెరువులు జలకళను సంతరించుకొని అలుగు పోస్తున్నాయి. వరదలో పలుగ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ఇళ్లలోని నీరుచేరడంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి పత్తి, పెసర చేలల్లో వరదనీరు నిలువగా.. అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వాగుల ఉధృతిని పరిశీలించి గ్రామస్తులను అప్రమత్తం చేయడంతో పాటు సహాయక చర్యలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్


తల్లాడ: బిల్లుపాడులో వరద నీటిలో మునిగిన వరిపైరు


ఏన్కూరు: పత్తి చేనులో చేరిన వరదనీరు


పెనుబల్లి: అలుగుపడిన రాళ్లోని చెరువు


కొణిజర్ల: లక్ష్మీపురంలో రాయల పుల్లమ్మ ఇంటిలోకి చేరిన వరదనీరు


సత్తుపల్లిరూరల్: కొత్తూరు గ్రామంలోకి చేరిన వరదనీరు


బోనకల్: చిన్నబీరవల్లి వద్ద వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి


ముదిగొండ: మల్లన్నపాలెం వద్ద మునిగిన పొలాలు


చింతకాని: రామకృష్ణాపురం వద్ద ఖమ్మం - బోనకల్ ప్రధాన రహదారిపై..

➡ నీట మునిగిన 150 ఎకరాల వరి..


నీట మునిగిన వరిపొలం

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండిలో గురువారం కురిసిన భారీ వర్షానికి సుమారు 150 ఎకరాల వరి పంట నీట మునిగింది. కురుస్తున్న వర్షాలకు చింతల చెరువు, వేంపల్లి చెరువు అలుగునీరు ప్రవహించే వాగు పరిసర భూమిని కొంతమంది ఆక్రమించుకుని చేపల చెరువు నిర్మాణాలు చేపట్టడంతో కుచించుకుపోయి వాగు నీరు పోటు వేసి పక్కన గల పొలాలను ముంచింది. బాధిత రైతుల సమాచారం మేరకు రెవెన్యూ శాఖ ఆర్ఐ సుజాత చిన్నకోరుకొండి గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు.

➡ 20 అడుగులకు చేరిన వైరా రిజర్వాయర్


అలుగు పోస్తున్న వైరా రిజర్వాయర్

వైరా/వైరారూరల్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వైరా రిజర్వాయర్ నీటి మట్టం 20 అడుగులకు చేరింది పూర్తిస్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా గురువారానికి 20 అడుగులు దాటింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన రాజీవ్‌నగర్, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల వారిని వైరాలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు అధికారులు తరలించారు. వైరా మండలం పాలడుగు, వల్లా పురం గ్రామాల మధ్య, పుణ్యపురం, సిరిపురం గ్రామాల మధ్య వాగు పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వల్లాపురం గ్రామ సమీపంలో అమరావతి నాగపూర్ జాతీయ రహదారి వద్ద పనులు చేస్తున్న కూలీలు వరదలో చిక్కుకోవడంతో తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ ట్రాక్టర్ లో వారిని సురక్షితంగా బయటకు తరలించారు.

➡ పునరావాస కేంద్రం ఏర్పాటు


నీట మునిగిన గంగారం గట్టు బజార్ ఎనాదుల కాలనీ

సత్తుపల్లి: మండలం గంగారం గట్టుబజారులో ఇళ్లలోకి వరదనీరు పోటెత్తడంతో ఇళ్లన్నీ మునిగిపోయాయి. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచనలతో దాసరి మధుమోహన్‌రెడ్డి పునరావాస బాధితులకు స్థానిక దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ స్కూల్‌లో శిబిరం ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ చిన్ననాగేశ్వర రావులతో పాటు చెన్నకేశవరావు, అప్పారావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

జయ జయ గణనాయకా

వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా గణనాధులను మండపాలలో కొలువుదీర్చారు. గురువారం రెండో రోజు కూడా గణ నాధుడికు పలువురు దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. పలుచోట్ల భారీ సెట్టింగులతో గణపతిని ప్రతిష్ఠించగా కొందరు మట్టి వినాయకుడిని పూజించారు. జైబోలో గణేష్ మహారాజ్‌కీ జై, గణపతి బొప్పా మోరియా అంటూ భక్తులు చేసిన నినాదాలు గ్రామాల్లో మార్మోగాయి.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: సుందరయ్య నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు


సత్తుపల్లిటౌన్: ఎమ్మెల్యే రాగమయి దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు


తల్లాడ: పూజలు చేస్తున్న భక్తులు


వైరారూరల్: విప్పలమడకలో ఎన్నెస్పీ పుష్పాల రామారావును సత్కరిస్తున్న దృశ్యం


కొణిజర్ల: తనికెళ్ల ఆఫీస్ సెంటర్‌లో..


ఏన్కూరులో..


చింతకాని: ప్రొద్దుటూరు గ్రామంలో..


కారేపల్లి శ్రీవెంకటసాయినగర్‌లో..


ఎర్రుపాలెం: పెద్దగోపవరంలో..


బోనకల్: ముష్టికుంట్లలో..


ముదిగొండ: బాణాపురంలో..

సాయినాధుడికి ప్రత్యేక పూజలు


స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయినాధుడి ఆలయాల్లోని బాబాకు గురువారం భక్తులు పూజలు చేశారు. ఆయా ఆలయాల అర్చకులు స్వామివారికి కర్పూర హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో కుడుముల రూపేష్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై సీపీఎం ధర్నా


తల్లాడ: కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. పాలకులు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల గ్రామాల్లో సమస్యలు అలాగే ఉంటున్నాయని విమర్శించారు. గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి దర్గయ్య, రామిరెడ్డి, వెంకటయ్య, చలపతిరెడ్డి, వెంకటశేషిరెడ్డి, సత్యం పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో..

సత్తుపల్లిరూరల్: కాకర్లపల్లి గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యాన పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలపై పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి జ్యోతి, కుమారస్వామి, సనందరావు, వేలాద్రి, పాల్గొన్నారు.

పగిడేరుపై బ్రిడ్జి నిర్మించాలి


వైరా తీగలబంజర పగిడేరు వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల: మండలంలోని లాలాపురం, తీగలబంజర గ్రామాల మధ్య ఉన్న పగిడేరుపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు పగిడేరు వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ.. పగిడేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోగా, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు రవాణా నిలిచిపోయిందన్నారు. వరదలు వచ్చినప్పుడు అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. అధికారులు, ప్రజాప్రతినిధులు కానీ ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీడీఓ ఉపేంద్రయ్య, తహసీల్దార్ అరుణలకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, చలపతిరావు, శ్రీనివాసరావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు


వరిపొలంలోని విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టిన అధికారులు, సిబ్బంది

ముదిగొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు న్యూలక్ష్మీపురం – వెంకటగిరి సమీపంలోని వరి పొలాల్లో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గురువారం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సహాయంతో విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు. పమ్మి నుంచి 132/33 కేవీ నుంచి ముదిగొండకు విద్యుత్ సరఫరా చేసే 33కేవీ, లక్ష్మీపురంలోని ఫీడర్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ స్తంభాలు రెండు వర్షపు నీటి వరదలో పడిపోయాయి. వాటిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వరరావు, ఏడీఈ రామకృష్ణారావు, ముదిగొండ ఏఈ మేకపోతుల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్లూరు మండలంలో సొసైటీ సీఈఓల బదిలీలు

కల్లూరురూరల్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈఓల బదిలీలు జరిగాయి. కల్లూరు సొసైటీ సీఈఓగా పనిచేస్తున్న బీరవెల్లి శ్రీనివాసరావును చిన్న కోరుకొండికి సొసైటీకి బదిలీ కాగా.. అక్కడ పని చేస్తున్న సీఈఓ చప్పిడి వేలాద్రి కల్లూరుకు బదిలీపై వచ్చారు. అదే విధంగా చెన్నూరు సొసైటీ సీఈఓ దేవరపల్లి మురళీని తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీకి బదిలీ చేశారు. పోచారం సొసైటీ సీఈఓ మట్ట అంజయ్యను గరికపాడు సొసైటీకి బదిలీ చేయగా, చెన్నూరు సొసైటీకి మెరుగు వెంకటేశ్వరరావు, పోచవరం సొసైటీకి రామకృష్ణ బదిలీపై వచ్చారు. దీర్ఘకాలం తర్వాత సొసైటీ సీఈఓలకు బదిలీ జరిగాయి. కొర్లగూడెం సొసైటీకి మాత్రం సీఈఓను నియమించలేదు.

ఓటర్ల ముసాయిదా జాబితా ప్రదర్శన


బోనకల్: మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ రమాదేవి

సత్తుపల్లిరూరల్/బోనకల్/కల్లూరురూరల్: త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఆయా పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో వార్డుల వారీగా గురువారం అధికారులు ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత పంచాయతీ సెక్రటరీకి తెలిపి 30వ తేదీ కల్లా పరిష్కరించుకోవాలని, సెప్టెంబర్ 2వ తేదీన తుది జాబితా ఖరారు చేయబడుతుందని అధికారులు తెలిపారు. ఈనేపథ్యాన సత్తుపల్లి మండలంలోని 21 గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు ప్రదర్శించారు. బోనకల్ మండలంలోని 22 గ్రామాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయాల్లో ఉంచినట్లు ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. కల్లూరురూరల్ మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ జాబితాను ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ విడుదల చేశారు. 30వ తేదీన మండల స్థాయిలో పోలింగ్ బూత్‌లకు సంబంధించి గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాల్లో తప్పులు..

తల్లాడ: మండలంలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు–2025 ముసాయిదా ఓటర్ల జాబితా తప్పులు తడకగా ఉన్నాయి. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాబితాలను ప్రదర్శించగా.. అన్నారుగూడెం, మల్లారం, తల్లాడ గ్రామాల్లో ఒక కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు వేర్వేరు వార్డుల్లో ఉండడం, ఒక్కో వ్యక్తికి రెండేసి వార్డుల్లో ఓటు హక్కు ఉండడం, గ్రామంలో లేని వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితా లో ఉండడం వంటివి చోటు చేసుకున్నాయి.

వరద నీరు వెళ్లేలా..


పాత బస్టాండ్ ఏరియాలోని బ్రిడ్జిపై రంధ్రాల్లో చెత్త తీస్తున్న స్థానికులు

సత్తుపల్లి(కల్లూరు): కల్లూరు పాత బస్టాండ్ సమీపాన ఎన్ఎస్‌పీ బ్రిడ్జిపై నీరు నిలువడంతో వాహనాల రాక పోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో కల్లూరుకు చెందిన రెడ్డి మెడికల్స్ యజమాని కర్నాటి అప్పిరెడ్డి గడ్డపారతో బ్రిడ్జిపైన మూసుకుపోయిన రంధ్రాల వద్ద శుభ్రం చేయడంతో నీరు సాఫీగా ముందుకు సాగింది.

ఇసుక లారీ సీజ్

తల్లాడ: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని మండలంలోని మిట్టపల్లిలో గురువారం పోలీసులు సీజ్ చేశారు. ఏపీలోని కొవ్వూరు సమీపాన గోదావరి నుంచి ఇసుకను లారీలో తరలిస్తుండగా మిట్టపల్లి వద్ద తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి లేదని తేలడంతో లారీని సీజ్ చేయడమే కాక డ్రైవర్ పెనుగొండ ఉపేందర్, వీఎం.బంజరకు చెందిన యజమాని బి.చెన్నారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

భూపోరాట యోధుడు శ్రీశైలం

కొణిజర్ల: నిర్బంధాలను ఎదుర్కొని పోడు భూములను నిరుపేదలకు పంచిన పోరాట యోధుడు పొట్లపల్లి శ్రీశైలం అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ అన్నారు. బుధవారం మండలంలోని రామనరసయ్యనగర్‌లో నిర్వహించిన శ్రీశైలం వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన స్థూపానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు పొట్లపల్లి విప్లవ్‌కుమార్ ఆంగోత్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చల్లా ఉపేందర్, భూక్యా శంకర్, ఖాసీమ్‌ఖాన్, కిషోర్, నాగేశ్వరరావు, దస్రు, సీతయ్య, లచ్చన్న పాల్గొన్నారు.

వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు

వేంసూరు: షాలెం ప్రేయర్ మినిస్ట్రీ చెన్నైకి చెందిన లిటరిసీ ఇంటర్ ఇండియా ట్రస్ట్ ఆర్థిక భాగస్వామ్యంతో వందశాతం అక్షరాస్యతే లక్ష్యంగా వయోజన విద్యాకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు షాలెం ప్రేయర్ మినిస్టర్ చీఫ్ ఫంక్షనర్ సీజెడబ్ల్యూకే జాన్ బాబు అన్నారు. గురువారం వెంకటాపురం రైతు వేదిక వద్ద శిక్షణపొందిన వయోజన విద్యా కేంద్రాల టీచర్లకు డాక్టర్ వీర్ల కిరణ్ కుమార్ పలకలు, బాక్స్ బోర్డులు, లెట్లు, పుస్తకాలు, పంపిణీ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

వేంసూరు: మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మట్టా రాగమయి గురువారం పంపిణీ చేశారు. అనంతరం కందుకూరు తుంగవారి కాలనీ సమీపంలో ఉన్న ఉప్పువాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయనంద్, మండల అధ్యక్షుడు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ పైజుద్దీన్, మందపాటి రాఘవరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, కనమతరెడ్డి రంగారెడ్డి, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

గైడ్ వాల్స్‌ను నాణ్యతతో నిర్మించాలి

వైరారూరల్: వైరా రిజర్వాయర్ కాలువల రెండో విడత ఆధునీకరణ పనులు నాణ్యతతో చేపట్టకపోవడం వలన రెండోసారి గైడ్ వాల్వులు కూలాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. విప్పలమడక గ్రామ సమీపంలోని అన్నపూర్ణ కల్యాణ మండపం సమీపంలో కూలిన 50మీటర్ల రిజర్వాయర్ కుడి కాలువ గైడ్ వాల్వును రైతు సంఘం నాయకులు పరిశీలించి మాట్లాడారు. ఇకనైనా గైడ్ వాల్వులను నాణ్యతతో నిర్మించాలని డిమాండ్ చేశారు.

నియామకం..

కొణిజర్ల: అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొణిజర్ల మండలం రామనరసయ్యనగర్‌కు చెందిన సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు పాశం అప్పారావు నియమితులయ్యారు. ఈ నెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. వైరా డివిజన్ వ్యాప్తంగా రైతు సమస్యల పరిష్కారానికై తన వంతు కృషి చేస్తానన్నారు.

గురుకుల బాలికల విద్యా విహారయాత్ర

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల, డిగ్రీ కళాశాల విద్యార్థులు విద్యా విహార యాత్రలో భాగంగా గురువారం ఖమ్మంలోని ఐటీ హబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టాస్క్ హెడ్ సంతోష్, మేనేజర్ బాలూ ప్రవరాఖ్య టెక్సోజెన్ హెచ్‌ఆర్‌లు బాలికలు ఐటీ హబ్‌లోని విభాగాలు, ఉద్యోగావకాశాలు గురించి వివరించారు. ప్రిన్సిపల్ రజని, వైస్ ప్రిన్సిపల్ నవ్య, కోఆర్డినేటర్‌లు కేపీ ఐశ్వర్య, దీప్తి, రజని, రజిత, శిరీష, సారిక, హేమ భార్గవి, రాధ, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతిలో ఈ నెల 20న మృతి చెందిన పగడాల మనోజ్ కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పరామర్శించారు. మనోజ్ తల్లిదండ్రులు వనజాక్షి, నగేష్‌లను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె నారాయణరావు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, చెరుకుమల్లి రవి, షేక్ మస్తాన్ మాజీ సర్పంచ్ సవళ్ల ముత్తయ్య, నాగేశ్వరరావు, తదితరులున్నారు. అదే విధంగా మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సతీమణి మంజుల, కురుమ సంఘం జిల్లా నాయకులు, పలువురు మండల నాయకులు పరామర్శించారు.